# ఎన్నారై కబుర్లు

## సత్యం మందపాటి

**ఈమధ్య టీవీలో సన్‌డాన్స్ ఛానల్లో ఒక డాక్యుమెంటరీ చూశాను. అది అమెరికాలో అలబామా రాష్ట్రంలో స్కిన్ హెడ్స్ అనే సంస్థ గురించి.**

ముందుగా స్కిన్ హెడ్స్ అంటే ఏమిటో చెప్పాల్సిన అవసరం ఉంది. శ్వేత జాతీయుల ఉన్నతిని కాపాడుకునే సంస్థ. జర్మనీలో హిట్లర్ మొదలుపెట్టిన అహంకారానికి వారసత్వం గుండు కొట్టించుకోవటమో, జుట్టు మిలటరీ క్రాపులా చేయించుకోవటమో వీరి లక్షణం. వీళ్లే ఆర్యన్స్ అని చెప్పుకుంటారు. అంతేకాదు జబ్బల మీద స్వస్తికా ముద్ర వేసుకుంటారు. ఈ ప్రపంచం తెల్లవారిదే అనీ మిగతావాళ్లకి స్థానం లేదనీ వీరి నమ్మకం. అమెరికాలోని కూక్లక్స్‌క్లాన్‌తో (కకక) వీళ్లకి దగ్గరి సంబంధాలు ఉన్నాయి.

ఆరోజు నేను చూసిన డాక్యుమెంటరీ తీసింది ఇటువంటి దురభిమానాలకి దురహంకారాలకి వ్యతిరేకంగా ఉన్న ఒక తెల్లమ్మాయి. అటువారి వేపునించీ, ఇటు తన వేపునించీ చాలా నేర్పుగా తీసిందా సినిమాని. అది చూస్తున్నప్పుడే నాకు ఈ వ్యాసం రాయటానికి స్పందన వచ్చింది.

సాటి తెల్లవారు చిన్నచిన్న పిల్లలుగా ఉన్నప్పుడే వాళ్లని ఈ ఉద్యమంలో చేర్చుకుని, మొదటినించీ వాళ్లల్లో తెల్లజాతి అహంకారాన్ని నింపటమే కాక మిగతా వారిమీద ద్వేషాన్ని కూడా ఎక్కువ చేస్తారు. తుపాకులు కాల్చటం, నల్లవారిని విదేశీయులనీ ఇబ్బంది పెట్టటం, వారితో కారణం లేకుండా పోట్లాడటం, కొట్టటం, వారి రక్తం కళ్లచూడటం, చివరికి చంపటం కూడా వీరి లక్ష్యాలు. వీళ్ల కార్యక్రమాలన్నీ చట్టవిరుద్ధాలే. అందుకని వీళ్లు చేసే కార్యకలాపాలన్నీ రహస్య ప్రదేశాల్లోనే. అప్పుడప్పుడూ తెల్లటి ముసుగులు వేసుకుని ప్రదర్శనలు కూడా ఇస్తారు. అప్పుడు వాళ్లని అరెస్టు చేయటానికి పోలీసులకి అధికారం లేదు. ఎందుకంటే వాళ్లలో ఎవరు ఏం చేశారో ఆధారాలు ఉండవు కనుక. అందుకని వీళ్లని పోలీసులు కూడా వెయ్యి కళ్లతో చూస్తుంటారు.

ఆ డాక్యుమెంటరీ అలాటి ఒక ఆర్యన్ ముఠాని కొన్ని నెలలపాటు వారితో ఆ రహస్య జీవితం గడుపుతూ తీసినదే. వాళ్ల లక్ష్యాలూ కార్యక్రమాలూ ప్రజలకి చూపటం కారణంగా, ఆ డాక్యుమెంటరీ నిర్మాణానికి వాళ్లు అనుమతిచ్చారు. చర్చికి వెడుతున్న కొంతమంది నల్లవారిని చంపటానికి వ్యూహం పన్నిన వాళ్ల నాయకుడిని పోలీసులు ఆ ఎన్‌కౌంటర్లో కాల్చి చంపటంతో, ఆ జరిగిన కథతో తీసిన సినిమా ముగుస్తుంది.

ఆ సినిమా చూసిన రాత్రి సరిగ్గా నిద్ర పట్టలేదు. మహాత్మా గాంధీగారు చెప్పినట్టు, మనుష్యులంతా దేవుడి పిల్లలే అయితే మరి ఈ తారతమ్యాలెందుకు? అసహ్యాలూ ద్వేషాలూ ఎందుకు? మనిషే మనిషిని పీక్కుతింటుంటే, మనిషికీ పశువుకీ తేడాలేమిటి? అలా సాగుతున్న ఆలోచనలు అక్కడితో ఆగలేదు. ఇలాటివి చాలాచోట్ల చాలా రకాలుగా చూస్తున్నాం.

అమెరికా మీద పాత ద్వేషంతో ఒసామా బిన్‌లాడెన్ పట్టపగలు న్యూయార్కులో కొన్ని వేలమందిని పొటన పెట్టుకున్నాడు. వారిలో ఎంతోమంది మొదటి, రెండవ తరం భారతీయులూ కూడా ఉన్నారు. అమెరికా అధ్యక్షుడు ఒసామాని పట్టుకోలేక ఇరాక్ మీద దండయాత్ర చేసి ఆ ప్రాంతమంతా మట్టిపాలు చేశాడు. ఒక్క కాశ్మీరులోనే మనకి స్వాతంత్ర్యం వచ్చినప్పటినించీ కొన్నివేల మంది హిందువులు చంపబడ్డారు. అయోధ్య పేరుతో అటు ముస్లింలు, ఇటు హిందువులు వేల సంఖ్యలో చంపబడ్డారు. చైనా, సోవియట్ యూనియన్, పోలాండ్ లాటి కమ్యూనిస్టు దేశాల్లోనే కమ్యూనిజం చచ్చిపోతే, మనవాళ్లకి కొందరికి ఆ కమ్యూనిజం కావాల్సివచ్చింది.

## తలుపు తీయవూ!

ప్రపంచంలో ఎక్కడ చూసినా ఏదో ఒక ద్వేషం. కారణాలు ఏమైనా మనిషికీ మనిషికీ పడదు. వీళ్లల్లో మానవత్వం ఉన్నవాళ్లు ఎవరు? మనుషులుగా పుట్టినందుకు, మనుషులుగా బ్రతుకుతున్నవాళ్లెందరు? దేశభక్తులు ఎవరు? ఉగ్రవాదులు ఎవరు?

★ ★ ★

ఎప్పుడో నేను ఆస్టిన్ అమెరికన్ స్టేట్స్‌మన్ అనే మావూరి న్యూస్‌పేపర్లో రాసినది గుర్తుకి వచ్చింది. ఉగ్రవాదికి (టెర్రరిస్టు) దేశభక్తుడికి (పేట్రియాట్), ఆ పదాల భాషలో ఒక నిర్దిష్టమైన అర్థమయితే ఉన్నది కానీ, నిజ జీవితంలో దాని అర్థం మనం ఎటువేపునించీ చూస్తున్నాం అన్నదాన్నిబట్టి ఉంటుంది. ఉదాహరణకి ఒక పాలస్తీను వ్యక్తి, ఒక జూయిష్ వ్యక్తులను తీసుకుందాం. జెరూసలేంలో ఒక జ్యూయిష్ పిల్లలు ఉన్న స్కూల్లోకి, ఒక పాలస్తీను మనిషి జీపు నిండా బాంబులు పెట్టుకువెళ్లి, తను ఆత్మహత్య చేసుకుని వాళ్లందరినీ చంపేశాడనుకోండి. అతను పాలస్తీను వారికి దేశం కోసం ప్రాణాలు అర్పించినవాడిలా, దేశభక్తిపరుడిగా నిలిచిపోతాడు. కానీ ఇజ్రాయిల్ వాళ్లకి అతనొక ఉగ్రవాది. హంతకుడు. అలాటి పనే చేసిన ఒక జ్యూయిష్ అతను ఇజ్రాయిల్ వారికి అమరుడు, పాలస్తీను వారికి టెర్రరిస్టు.

నేను లండన్‌లో వెస్ట్‌మినిస్టర్ ఏబ్బీలో నడుస్తున్నప్పుడు చూసిన ఒక విషయం మీతో చెప్పాలి. మనం ఇండియాలో బ్రిటీష్ వాళ్లల్లో కొంతమందిని ఎంత నరరూప రాక్షసులుగా భావించేవాళ్లమో, వాళ్లకి అక్కడ విగ్రహాలు ప్రతిష్ఠ చేసి, ఎంతో దేశభక్తులుగా నమస్కారాలు పెడుతున్నారు. వాళ్లల్లో ప్రముఖుడు, జలియన్‌వాలాబాగ్‌లో కొన్ని వేలమంది భారతీయులని నిర్దాక్షిణ్యంగా కాల్చి చంపేసిన జనరల్ డయ్యర్. అతన్ని అమరుడిగా చిత్రించిన నిలువెత్తు శిలావిగ్రహం. దానికి ప్రతీరోజూ ప్రజల నివాళి. శ్రద్ధాంజలి. ఇలా ఒకే విషయాన్ని రెండు దృక్పథాలనించీ చూస్తుంటారు జనం. అలాటప్పుడు కొంచెం పై పరిధిలోకి వెళ్లి న్యాయం, ధర్మం అనే దృక్పథాల్లో నుంచీ చూడాలేమో!

ఇక్కడ కూడా చిన్న గొడవ ఉంది. ఒకసారి ఇండియా నించీ వచ్చిన ఏలూరిపాటి అనంతరామయ్యగారితో మా ఆస్టిన్ నగరంలో సాహిత్యసభ పెట్టినప్పుడు, ఆయన్ని ఒక ప్రశ్న అడిగాను న్యాయానికి, ధర్మానికి ఏమిటి తేడా అని. దానికి ఆయన చెప్పిన జవాబు న్యాయమనేది ఆ ప్రదేశపు, దేశపు, చట్ట పరిధిలో రక్షణ కల్పించేది. ధర్మం అనేది లోకధర్మం. మానవజాతికి ఎవరు ఎక్కడ ఉన్నా అన్వయించేది. ఉదాహరణకి ఇండియాలో కారుని రోడ్డుకి ఎడమ పక్కన నడపాలనీ, అమెరికాలో రోడ్డుకి కుడిపక్కన నడపాలనీ చట్టరీత్యా న్యాయబద్ధం చేశారు. ఈ రెండు పద్ధతులూ పూర్తిగా వేరయినా, అవి ఆ దేశాలు ఏర్పర్చుకున్నవి. దాన్ని ఉల్లంఘిస్తే న్యాయస్థానం శిక్ష వేస్తుంది. ఎక్కడ ఉన్నా న్యాయం పాటించటం లోకధర్మం. ఇలా చాలా ఉదాహరణలు చెప్పుకోవచ్చు.

తమని తామే హతం చేసుకుంటూ, తాము ద్వేషించేవారిని హతం చేయటం కొంతమందికి న్యాయంగానే తోచవచ్చు. మతాల పేరుతో, కులాల పేరుతో, అగ్రరాజ్యాల పేరుతో ఎవరి న్యాయాన్ని వాళ్లు తమ పరిధుల్లోకి తీసుకువస్తున్నారేమో! అయితే మరి లోకధర్మం మాటేమిటి?

శ్రీశ్రీగారు చెప్పినట్టు, 'ఏ దేశ చరిత్ర చూసినా ఏమున్నది గర్వకారణం?'

ఇది రాస్తుంటే ఒకసారి గురువుగారు బాపూగారు చెప్పిన ఒక చిన్న కథ గుర్తుకి వస్తున్నది. ఒకరోజు మహారాజు అశోకుడు విహారం చేస్తూ గుర్రం మీద బయల్దేరాడుట. అప్పుడు ఆయనకి ఒక బిచ్చగాడు ఎదురుపడ్డాడుట. రాజుని చూసి అతను "మీ రాజులకి వేరే పనేమీ లేదా, ఎప్పుడూ ఒకళ్లమీద ఇంకొకళ్లు యుద్ధాలు చేసుకోవడం తప్ప. నేనే కనుక రాజుని అయితే అసలు యుద్ధాలు చేయను" అన్నాడుట. అశోకుడు నవ్వి "అవును మరి నేను రాజుని కదా యుద్ధం చేయక తప్పదు. నేనే కనుక బిచ్చగాడిని అయితే నేనూ అసలు యుద్ధాలు చేయను" అన్నాడుట. దాన్ని రాజధర్మం అంటారేమో. అలా ఒకళ్లనొకళ్లు యుద్ధాల్లో చంపుకోవటం ధర్మమెలా అవుతుందీ అని నాకు తరువాత వచ్చిన ధర్మసందేహం. అలాగే శ్రీరాముడు సీతని అడవిపాలు చేయటం న్యాయమా? రాజధర్మమా?

నా ఆలోచనలు ఎక్కడ మొదలయి ఎక్కడిదాకా వెళ్లేయో చూస్తే, ఈ విషయం గురించి ఆలోచనా ఆవేదనా మాత్రమే కాకుండా, నా అవగాహనకి ఆనకట్టలు పడుతున్నట్టు నాకే అనిపిస్తున్నది.

★ ★ ★

న్యాయం, ధర్మాల కన్నా నాకు మానవత్వపు విలువల మీదా, మానవత్వం మీదా నమ్మకం ఎక్కువ. నాకెప్పుడూ అనిపిస్తూ ఉంటుంది, ఎవరి న్యాయాలు ఎలా ఉన్నా, ఎవరి ధర్మాలు ఎలా ఉన్నా, ఒక మనిషిని ఇంకొక మనిషి గౌరవించటం, ప్రాణానికి విలువనివ్వటం అవసరం అని.

కాకపోతే, తమ అడ్డదిడ్డమైన ఆలోచనలకి అడ్డంగా ఉన్న రంగుల తెరలు కొంచెం పక్కకు జరపాలి. మానవత్వపు మాధుర్యాన్ని చూపించే ఆ హృదయ కవాటాలని తెరవాలి.

అందుకే అడుగుతున్నాను 'తలుపు తీయవూ' అని.

*

రచయిత ఇ-మెయిల్ చిరునామా:
satyam_mandapati@yahoo.com